సాక్షి బాపట్ల

శుక్రవారం । 13 । జనవరి । 2023

I

సత్తెనపల్లిలో

వైఎస్సార్ సంక్రాంతి గ్రామీణ ముగ్గుల పోటీల ముగింపు ఉత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. విజేతలను మంత్రి అంబటి రాంబాబు ప్రకటించారు. ప్రథమ బహుమతి పొందిన తిరుపతమ్మకు రూ.2లక్షలు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్యవరప్రసాద్, ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి, పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

- సత్తెనపల్లి

ముగ్గు వద్ద ప్రథమ బహుమతి సాధించిన తిరుపతమ్మ





న్యూస్‌రీల్

144 సెక్షన్ గడువు పొడిగింపు


మాచర్ల: పట్టణంలోని శాంతిభద్రతల దృష్ట్యా ఈనెల 22వ తేదీ వరకు 144 సెక్షన్‌ను పొడిగించినట్లు అర్బన్ సీఐ టి బాలకృష్ణ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గత నెల 16వ తేదీన పట్టణంలో అల్లర్లు జరిగిన నేపథ్యంలో విధించిన 144 సెక్షన్ పూర్తిస్థాయిలో అమలు చేస్తున్నట్లు తెలిపారు. అనుమతి లేకుండా ర్యాలీలు, సభలు, బహిరంగసభలు నిర్వహించకూడదన్నారు. ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించి 144 సెక్షన్‌కు అనుగుణంగా నిబంధనలు పాటించాలని సీఐ కోరారు. రెవెన్యూ శాఖ ఆదేశాల మేరకు 144 సెక్షన్‌ను అమలు చేస్తున్నట్లు తెలిపారు.

పులిచింతల నీటి నిల్వ




అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టు ప్రస్తుత నీటి నిల్వ 43.9377 టీఎంసీలు. ప్రాజెక్టు ఎగువ నుంచి 4200 క్యూసెక్కులు వచ్చి చేరుతుండగా దిగువకు 4000 క్యూసెక్కులు వదులుతున్నారు.

సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం గురువారం 576.00 అడుగుల వద్ద ఉంది. ఇది 271.6270 టీఎంసీలకు సమానంగా ఉంది. సాగర్ జలాశయం నుంచి కుడి కాలువకి 9,567, ఎడమ కాలువకు 8,541, ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి 8,694, ఎస్ఎల్‌బీసీకి 2,400, వరద కాలువకు 300 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. సాగర్ జలాశయం నుంచి మొత్తం ఔట్‌ఫ్లోగా 29,522 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం నుంచి సాగర్ జలాశయానికి 29,522 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 851.10 అడుగుల వద్ద ఉంది. ఇది 82.5758 టీఎంసీలకు సమానం.

సాగునీటి సమాచారం




తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద గురువారం 1216 క్యూసెక్కులు విడుదల చేశారు. బ్యాంక్ కెనాల్‌కు 64, తూర్పు కెనాల్‌కు 30, నిజాంపట్నం కాలువకు 125, కొమ్మమూరు కాల్వకు 613 క్యూసెక్కులు విడుదల చేశారు.

యార్డుకు 67,060 బస్తాల మిర్చి



కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు గురువారం 67,060 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 63,028 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నెంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.10,000 నుంచి రూ.26,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.27,500 వరకు పలికింది. ఏసీ కామన్ రకం మిర్చి క్వింటాళ్లకు రూ.14,000 నుంచి రూ.25,000 వరకు ధర లభించింది. ఏసీ ప్రత్యేక రకాలకు రూ.13,000 నుంచి రూ.22,000 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.4,000 నుంచి రూ.12,500 వరకు ధర లభించింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 34,835 బస్తాలు మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

నిమ్మకాయల ధరలు



తెనాలిటౌన్: తెనాలి మార్కెట్‌యార్డులో గురువారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.2000, గరిష్ట ధర రూ.3100, మోడల్ ధర రూ.2500 వరకు పలికింది.

తుళ్లిపడుతున్న పల్లెలు

- సంక్రాంతికి సొంతూళ్లకు..
- నగరాలు, పట్టణాల నుంచి రాక
- పిల్లాపాపలతో కళకళలాడుతున్న పల్లెటూళ్లు
- అందరి మధ్య పండుగ కోసం ఉవ్విళ్లూ..
- కిటకిటలాడుతున్న బస్టాండ్‌లు...రైల్వే స్టేషన్లు





సంక్రాంతి పండక్కి సొంతూరుకి, యూకే నుంచి భర్త గ్లేహోర్డ్ క్లింగ్‌తో కలిసి వచ్చిన అరవింద మీరా



కిటకిట..గుంటూరు రైల్వేస్టేషన్‌లో ప్రయాణికుల రద్దీ



తమ బిడ్డలకు స్వాగతం చెప్పేందుకు పల్లెటూళ్లు నిజంగా బంతి పూల వనాలవుతున్నాయి. ఊరికంటే ముందు ముంగిళ్లు రంగ వల్లులవుతున్నాయి..పసుపు కుంకుమలు, గొబ్బెమ్మలతో మరింత సొగసును అద్దుకుంటున్నాయి... 'రమా రమణ గోవిందో హరి' అనుకుంటూ వచ్చే హరిదాసులు...అపర నందీశ్వరుడిని పోలిన గంగిరెద్దులు, సన్నాయి, డోలు వాద్యకారులూ...అబ్బా తలచుకుంటూనే మనసు తుళ్లిపడుతుంటుంది. ఇది కదా సం'క్రాంతి' అనిపిస్తోంది.

తెనాలి: ధనుర్మాసం నుంచి సంక్రాంతి వరకు పల్లెసీమల్లో పండుగ వాతావరణం అలుముకుంది. అందుకే ఉద్యోగం, వ్యాపారీత్యా హైదరా'బాధ'ల్లో ఉన్నా, ఇంకే మెట్రో నగరంలో స్థిరపడినవారంతా సంక్రాంతి పండక్కి పల్లెను విస్మరించలేని బలహీనతతో ఉంటారు.

తెలుగువారి పండుగల్లో సంక్రాంతి విశిష్టమైంది...పండక్కి సెలవులొచ్చేశాయ్...పట్టణాలు, నగరాల్లోని ఇళ్లలో ఒకటే హడావుడి...నానా హైరానాపడి ఇంటిల్లపాదికీ టికెట్లను రిజర్వు చేయటం ఓ ప్రయాస. షాపింగ్ సందడి...కావాల్సిన సరంజామా సర్దుకోవటం, ఏదైనా తగ్గితే మళ్లీ బజారుకెళ్లటం...ఇందంతా సంక్రాంతికి సొంతూరుకెళ్లే ముచ్చట! 'గోరింటాకుతో పండిన రెండు చేతులకూ గాజులు వేసుకుంటేగానీ పండుగ కాదనుకునేవారు ఆడపిల్లలు. వయసొచ్చిన ఆడపిల్లలు లంగావోణీల మెరుపుల ముచ్చట్లతో కుందనపు బొమ్మలవుతారు...వడ్డాణం, అరవంక, బుట్టలు, కాసులహారం, ఆభరణాలు...వారి అందాన్ని ఇనుమడింపజేస్తాయి. ఆ తలపులతోనే సొంతూరులోని ఇల్లు చేరుకుంటారు మహిళలు. సొంతూరు ఇంతకు ముందులా అందంగా లేదు. వ్యవసాయ చట్రంలోంచి మనుషులు వెళ్లిపోయాక రైతు కూలీల అనుబంధం కొరవడింది. నాటి ఉమ్మడి బతుకుల కళాకాంతులూ, ప్రేమ ఆప్యాయతల పరిమళాలు తగ్గిపోయాయి. విశాలమైన ఖాళీ స్థలాలు, అందులో గంగరావి, జామ, మామిడి, మునగ, బొప్పాయి, కొబ్బరిచెట్లు ఇప్పుడు లేవు. పూరిళ్లు ఇరుకిరుకు వాటాలయ్యాయి. ఇంటిముందు పిచ్చుకలకు కట్టే పాల కంకుల్లేవు. రామచిలుకలు రావటం లేదు. పండక్కి ముగ్గులే కాదు, భోజనాలు...అన్నీ మొక్కుబడిగానే. కొబ్బరాకులతో బూరల బొమ్మలు, కోతికొమ్మచ్చి, బొంగరాలాట, తొక్కుడు బిళ్ల, వైకుంఠపాళీ, చింతగింజలాటలకు పిల్లలకు తీరికలేకుండాపోయింది. ఖాళీ సమయాన్ని టీవీ, మొబైల్ ఫోను ఆక్రమించింది. పండుగ రోజుల్లో ఆత్మీయతలను కలగలపుకోకుండా స్పెషల్ మూవీ ధమాకాలపై మనసుపోతోంది. కాలంతో వచ్చిన ఆధునికతతో పల్లెటూరు స్వరూపం మారింది. అయినప్పటికీ ఊరు వెళ్లాలి...అక్కడ మమతల అమ్మ ఉంది...ఆ మాతృమూర్తిలానే జీవిత మాధుర్యాన్నీ, ఆత్మీయతల్నీ పంచిన ఊరుకు వెళ్లకపోతే అదొక దిగులు అందుకే ఊరు వెళుతున్నామంటే ఎక్కడలేని ఆనందం... అందుకు సంక్రాంతి పండక్కి ఊరు పిలుస్తోంది... అనుకుంటూ వేలు, లక్షల మంది తీరిక చేసుకుని నగరాలు, పట్టణాల నుంచి బయలుదేరారు. కిటకిటలాడుతున్న బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు, అదనపు రైళ్లు, బస్సులే ఇందుకు సాక్ష్యం!

> 'కోడి కూతతోనే మేల్కొనేవారం ...కసవు చిమ్మి, కళ్లాపు చల్లిన వాకిలిలో ముగ్గులు వేసేవాళ్లం...ఎదురింటి మహాలక్ష్మి, పక్కింటి సరోజకన్నా పెద్ద ముగ్గు వేయాలనీ, గొబ్బెమ్మలు పెట్టాలనీ, సూర్యరథం వేయాలని పోటీలు పడేవాళ్లం' అనుకుంటూ మహిళలు యుక్తవయసులోని మధుర స్మృతులను గుర్తు చేసుకుంటున్నారు.

ఊరూరా గోదాములు



ధాన్యం నిల్వచేసుకునేందుకు సిద్ధంగా ఉన్న గోదాములు

- జిల్లా వ్యాప్తంగా 286 ఎంపీఎఫ్‌సీ నిర్మాణాలు
- 500 నుంచి 1000 మెట్రిక్ టన్నుల సామర్థ్యం
- రూ.110 కోట్లతో పనులు
- శరవేగంగా జరుగుతున్న మొదటి దశ పనులు
- మూడు దశల్లో పనులు పూర్తిచేయనున్న ప్రభుత్వం
- అన్నదాతలకు అన్ని వసతులు సమకూర్చే ఉద్దేశం

సాక్షి ప్రతినిధి, బాపట్ల : రైతుపక్షపాతిగా పేరుతెచ్చుకున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వ్యవసాయాన్ని మరింత బలోపేతం చేసేదిశగా చిత్తశుద్ధితో కృషిచేస్తుంది. ఇప్పటికే ఆర్‌బీకేలు(రైతుభరోసాకేంద్రం) నెలకొల్పి రైతులకు సబ్సిడీ విత్తనాలు, పురుగుమందులు సరఫరా చేస్తోంది. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేసి రైతులు పండించిన పంటలను గిట్టుబాటు ధరలకే కొనుగోలు చేస్తోంది. అధిక ధరలు వచ్చినప్పుడు రైతులు పంటలు అమ్ముకునే విధంగా చర్యలు చేపట్టింది. అప్పటివరకు పంటలను నిల్వచేసుకునేందుకు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతిసంఘాల పరిధిలో గోడౌన్ల నిర్మాణానికి సిద్ధమైంది. ఈ గోదాముల్లో రైతులు ధాన్యంతోపాటు ప్రభుత్వం అందించే విత్తనాలు, ఎరువులు నిల్వ చేసుకోవచ్చు. రైతులు పండించిన పంటలను గోదాముల ఆవరణలోనే ఆరబెట్టుకునే విధంగా ప్లాట్‌ఫామ్‌లు సైతం నిర్మిస్తున్నారు. ప్రస్తుతం జిల్లావ్యాప్తంగా గోడౌన్ల నిర్మాణపనులు వేగంగా సాగుతున్నాయి.

రూ.110 కోట్లతో గోదాముల నిర్మాణం

జిల్లావ్యాప్తంగా ప్రభుత్వం మూడు విడతల్లో 286 గోదాములు నిర్మించేందుకు సిద్ధమైంది. ఇందుకోసం రూ. 110 కోట్లు వెచ్చించనున్నారు. నాబార్డ్ అగ్రి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ స్కీమ్ కింద ఈ నిధులను పీఏసీఎస్‌లకు రుణాల రూపంలో అందజేస్తుంది. ప్రస్తుతం 112 పీఏసీఎస్ పరిధిలో గోదాముల నిర్మాణం చేపట్టారు. 500 నుంచి 1000 మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో గోదాములు నిర్మిస్తున్నారు. 1000 మెట్రిక్ టన్నుల గోదాములను రూ.70 లక్షలతో నిర్మిస్తుండగా, 500 మెట్రిక్ టన్నుల గోదాములకు రూ.40 లక్షలు కేటాయించారు. మల్టీపర్పస్ ఫెసిలిటేషన్ సెంటర్లుగా గోదాములు ఉండబోతున్నాయి. రైతులు పండించిన వివిధ రకాల పంటలను నిల్వచేసుకోవడంతోపాటు ప్రభుత్వం రైతులకు అందిస్తున్న సబ్సిడీ విత్తనాలు, ఎరువులు, ఇతరత్రావాటిని ఈ గోదాముల్లో నిల్వ ఉంచి సీజన్ వారీగా పంపిణీ చేయనున్నారు.

మొదటి విడతలో 54 గోదాముల నిర్మాణం

జిల్లాలో మొదటి దశలో ప్రభుత్వం 54 గోదాములు నిర్మిస్తుంది. నిర్మాణపనులు శరవేగంగా సాగుతున్నాయి. యద్దనపూడిలో నిర్మిస్తున్న గోదాము సామర్థ్యం 1000 మెట్రిక్ టన్నులు కాగా మిగిలిన 53 గోదాములు 500 మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో నిర్మిస్తున్నారు. ఈ దశలో 47 పీఏసీఎస్‌ల పరిధిలో గోడౌన్ల నిర్మాణం జరుగుతుంది. ఇప్పటివరకు చుండూరు మండలం మోదుకూరు, వేమూరు మండలం చావలి, జె.పంగులూరు మండలం కోటపాడు, కొప్పెరపాడుల్లో గోదాముల నిర్మాణం పూర్తయ్యింది. త్వరలోనే వీటిని ప్రారంభించనున్నారు. మిగిలిన వాటి నిర్మాణం వివిధ దశల్లో ఉంది. మార్చినాటికి ఈ గోడౌన్ల పూర్తి కానుంది.

రెండో దశలో 78

ఫేజ్-2లో 78 గోదాములు నిర్మించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఇందుకోసం మరో 45 పీఏసీఎస్‌ల పరిధిలో స్థలాలు కేటాయించారు. 30 గోదాములు 500 మెట్రిక్ టన్నుల సామర్థ్యం కాగా, 48 గోదాములు 1000 మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో నిర్మించనున్నారు. త్వరలోనే ఈ పనులు ప్రారంభం కానున్నాయి.

మూడో దశలో 77

జిల్లాలోని మిగిలిన పీఏసీఎస్‌ల పరిధిలో మరో 77 గోదాములు నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే 53 గోదాముల నిర్మాణానికి స్థలాలు కేటాయించారు. మిగిలిన వాటి నిర్మాణం కోసం స్థల సేకరణ చేపట్టాల్సి ఉంది. జిల్లా వ్యాప్తంగా మూడు విడతల్లో 286 గోదాములు నిర్మిస్తుండగా ఇందుకోసం రూ.110 కోట్ల నిధులు కేటాయించింది. మార్కెటింగ్‌శాఖ ఇంజినీరింగ్ విభాగం ఈ పనులు పర్యవేక్షిస్తుంది.

రైతుబాంధవుడు సీఎం వైఎస్ జగన్



రైతులు పండించిన పంటలు నిల్వ చేసుకునేందుకు గోదాములు నిర్మించడం సంతోషంగా ఉంది. గోడౌన్‌లతోపాటు ధాన్యాన్ని ఆరబెట్టుకునేందుకు ఫ్లాట్‌ఫాంలు నిర్మించడం ఉపయోగకరం. నిత్యం రైతుల గురించి ఆలోచిస్తున్న జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు.

– ఏడుకొండలరెడ్డి, కొత్తపాలెం, కర్లపాలెం మండలం

రైతులకు ఉపయోగకరం



ప్రభుత్వం జిల్లాలోని 112 పీఏసీఎస్‌ల పరిధిలో 286 గోదాములు నిర్మిస్తుంది. మొదటి దశ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. రెండు, మూడు దశల్లో మరికొన్ని గోదాముల నిర్మాణం మొదలు కానుంది. గోదాములు నిర్మించడంతోపాటు రైతులు పంటలు ఆరబెట్టుకునేందుకు ప్లాట్‌ఫామ్‌లను సైతం నిర్మిస్తున్నాం. నాబార్డ్ నిధులతో ప్రభుత్వం వీటిని నిర్మిస్తుంది.

– రామారావు, జిల్లా సహకారశాఖాధికారి, బాపట్ల

సంక్రాంతి సంబరాలు నిర్వహించటం సంతోషం



భోగిమంటలతో కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, ఎస్పీ వకుల్ జిందాల్

జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్

బాపట్ల: బాపట్ల జిల్లాలో సంక్రాంతి సంబరాలు నిర్వహించడం చాలా సంతోషంగా ఉందని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ అన్నారు. గురువారం బాపట్ల పోలీసు పెరేడ్ గ్రౌండ్స్‌లో సంక్రాంతి సంబరాలు పోలీసు శాఖ అధికారులు నిర్వహించారు. జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ మాట్లాడుతూ బాపట్ల జిల్లాలో జరుగుతున్న సంక్రాంతి సంబరాల్లో పాల్గొంటే తమ సొంత ఊర్లో ఉన్న అనుభూతి కలుగుతుందన్నారు. బాపట్ల జిల్లా ప్రజల్లో చాలా గౌరవం లభిస్తుందన్నారు. ఈలాంటి సంఘటనలు జీవితంలో మరిచిపోలేమన్నారు. పోలీసు అధికారులకు వారి కుటుంబాలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ మాట్లాడుతూ బాపట్ల జిల్లాలో సంక్రాంతి సంబరాలు జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. పోలీసు అధికారులు, సిబ్బంది నిత్యం శ్రమిస్తుంటారన్నారు. అందరిలాగా సాధారణ జీవితంలో సంతోషంగా ఉండాలని సంక్రాంతి సంబరాలు ఏర్పాటు చేశామన్నారు. పోలీసు అధికారులకు, సిబ్బందికి, వారి కుటుంబ సభ్యులకు క్రీడా పోటీలు నిర్వహించారు. విజేతలకు జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో బాపట్ల, చీరాల, రేపల్లె డీఎస్పీలు ఏ.శ్రీనివాస్, పి.శ్రీకాంత్, పి.మురళీకృష్ణ, సీఐలు మురళీకృష్ణ, వేణుగోపాల్‌రెడ్డి, శ్రీనివాసరావు, ఆర్ఐలు శ్రీకాంత్, మన్మధరావు తదితరులు పాల్గొన్నారు.

అపార్ట్‌మెంట్‌లో విషాదం

మెట్ల ల్యాండింగ్ బల్ల కూలడంతో ఇద్దరు మహిళలు మృతి

పర్చూరు: మెట్ల ల్యాండింగ్ బల్ల హఠాత్తుగా కూలి పోవడంతో ఇద్దరు మహిళలు మృతి చెందారు. ఈ సంఘటన పర్చూరులోని పవన్‌సాయి అపార్ట్‌మెంట్‌లో చోటు చేసుకుంది. ఎస్సై జి.వి. చౌదరి వివరాల ప్రకారం.. మూడో అంతస్తుకు వెళ్లే మెట్ల ల్యాండింగ్ బల్లపై నుంచొని చాగంటి శ్రీవిద్య (36) మరో మహిళ కొల్లా అనూరాధ (55) మాట్లాడుకుంటున్నారు. ఈ సమయంలో హఠాత్తుగా ల్యాండింగ్ బల్ల కూలిపోయి రెండో అంతస్తు ల్యాండింగ్ బల్లపై.. అనంతరం గ్రౌండ్ ఫ్లోర్‌లో పడిపోయింది. ఈ ఘటనలో బల్లతో పాటు పడిపోయిన శ్రీవిద్య అక్కడికక్కడే మృతి చెందిగా కొల్లా అనూరాధకు తీవ్ర గాయాలు కావడంతో పర్చూరు ప్రభుత్వాసుపత్రికి.. అనంతరం గుంటూరు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమె మృతి చెందింది. శ్రీవిద్య మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీరాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. నిర్మాణ లోపాల వల్ల ఇలా జరిగిందా.. మరి ఇతర కారణాలా అని దర్యాప్తులో తెలియాల్సి ఉంది. శ్రీవిద్య కుటుంబం గత ఏడేళ్ల నుంచి అపార్టుమెంటులో బాడుగకు ఉంటున్నారు. ఈమెకు భర్త , ఇద్దరు పిల్లలున్నారు. అనూరాధ కుటుంబ సభ్యులు 2011లో అపార్టుమెంటలో ఓ ప్లాట్‌ను కొనుగోలు చేసి ఉంటున్నారు. ఈమెకు భర్త, ఇద్దరు పిల్లలున్నారు.



శ్రీవిద్య మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై చౌదరి

క్లుప్తంగా

మేదరమెట్లకు వైవీ రాక నేడు

మేదరమెట్ల: టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి కొరిశపాడు మండలంలోని మేదరమెట్ల గ్రామానికి శుక్రవారం మధ్యాహ్నం రానున్నారు. గ్రామ పరిధిలో ఏర్పాటు చేసిన టీటీడీ కల్యాణ మండపం, ప్రభుత్వ వైద్యశాల నూతన భవనాలు, సెంట్రల్ లైటింగ్‌ను ప్రారంభించనున్నారు. మేదరమెట్ల-దైవాలరావూరు రోడ్డులో నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున, బాపట్ల జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొట్టు సత్యనారాయణ, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడుదల రజిని, శాప్‌నెట్ చైర్మన్, నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య, మాజీ ఎమ్మెల్యే బీసీహెచ్ గరటయ్య తదితరులు పాల్గొంటారని పార్టీ నాయకులు తెలిపారు.

ధర్మవరంలో వెలుగు చూసిన పురాతన శాసనం



అద్దంకి: బాపట్ల జిల్లా అద్దంకి మండలంలోని ప్రాచీన గ్రామమైన ధర్మవరంలో పురాతన రాతి శాసనం వెలుగు చూసినట్లు శాసన పరిశోధకుడు జ్యోతి చంద్రమౌళి అన్నారు. గురువారం ఆయన ధర్మవరం గ్రామంలోని మల్లికార్జున స్వామి దేవాలయ ఆవరణ ప్రాంతాన్ని పరిశీలించినట్లు చెప్పారు. క్రీస్తు శకం 10వ శతాబ్దం నాటి రాతి శాసనం ఆలయ జీర్ణోద్ధరణ చేస్తుండగా వెలుగు చూసినట్లు తెలిపారు. మాడయ్య అనే వ్యక్తి తన తమ్ముడికి మాధవ స్వామి సమక్షంలో దానం గురించి వేసిన శాసనంగా తెలుస్తోందన్నారు. ఇది చోళ రాజుల కాలం నాటిదిగా భావిస్తున్నట్లు చెప్పారు. పూర్తి వివరాలు పురావస్తు శాఖ పరిశీలన తరువాత వెల్లడించనున్నట్లు వివరించారు.

రైలుకిందపడి ఆత్మహత్య

దాచేపల్లి: కేసానుపల్లి రైల్వేగేట్ సమీపంలో రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన గురువారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. కేసానుపల్లికి చెందిన షేక్ ఖాసీంసైదా(44) అనారోగ్య కారణాలతో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనా స్థలాన్ని జీఆర్పీ పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గురజాల ప్రభుత్వ హాస్పిటల్‌కు తరలించారు. మృతుడికి భార్య ఇద్దరు పిల్లలున్నారు.

రైతు క్షేమమే వ్యాపారుల సంక్షేమం

- ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి
- గుంటూరులో ఘనంగా చిల్లీస్ మర్చంట్స్ అసోసియేషన్ దిగుమతి సంఘం నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం



దిగుమతి సంఘం నూతన కార్యవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న మిర్చి యార్డు చైర్మన్ చంద్రగిరి ఏసురత్నం, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్

కొరిటెపాడు(గుంటూరు): రైతుల సంక్షేమంలోనే వ్యాపారుల క్షేమం ఉంటుందని ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి పేర్కొన్నారు. ది గుంటూరు చిల్లీస్ మర్చంట్స్ అసోసియేషన్ దిగుమతి సంఘం నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం గురువారం నిర్వహించారు. మిర్చి యార్డు ఆవరణలోని శ్రీ వరసిద్ధి వినాయక దేవస్థానం ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో మిర్చి యార్డు చైర్మన్ చంద్రగిరి ఏసురత్నం ప్రమాణ స్వీకారం చేయించారు. నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన లేళ్ల అప్పిరెడ్డి, ఉపాధ్యక్షుడు తుమ్మలపల్లి రామారావు, కార్యదర్శి దాది నరేంద్రబాబు, సహాయ కార్యదర్శి షేక్ కరీముల్లా, కోశాధికారి కర్నూరపు కోటేశ్వరరావు ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమానికి దిగుమతి సంఘం మాజీ అధ్యక్షుడు కుర్రి సాంబిరెడ్డి అధ్యక్షత వహించారు. అనంతరం ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి మాట్లాడుతూ మిర్చియార్డు, దీనికి అనుసంధానమైన రైతులు, వ్యాపారులు, ఉద్యోగులు, కూలీలతో తనకు విడదీయరాని అనుబంధం ఉందని చెప్పారు. నూతనంగా ఎన్నికైన దిగుమతి సంఘం కార్యవర్గం దీన్నొక పదవిలా కాక బాధ్యతగా స్వీకరిస్తానని చెప్పారు. గుంటూరు నగరపాలక సంస్థ మేయర్ కావటి మనోహర్‌నాయుడు మాట్లాడుతూ ఏకగ్రీవ ఎన్నిక ద్వారా తామంతా ఒకటే కుటుంబమని చాటి చెప్పిన దిగుమతి సంఘం సభ్యులను ఆయన ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ మాట్లాడుతూ ప్రభుత్వ సహకారాన్ని మరింతగా అందిపుచ్చుకుని వ్యాపార విస్తృతిని పెంచి రైతులకు లాభం చేకూర్చాలని సూచించారు. మిర్చి యార్డు చైర్మన్ చంద్రగిరి ఏసురత్నం మాట్లాడుతూ ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి చొరవతోనే ది చిల్లీస్ మర్చంట్స్ అసోసియేషన్ దిగుమతి సంఘం ఎన్నిక ఏకగ్రీవం అయినట్లు చెప్పారు. జీడీసీసీ బ్యాంకు చైర్మన్ లాలుపురం రాము మాట్లాడుతూ ప్రతిష్టాత్మకమైన గుంటూరు మిర్చి యార్డులో ప్రతి పదవి కూడా ఎంతో కీలకమని తెలిపారు. కార్యక్రమంలో ఆలిండియా చిల్లీస్ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వెలగపూడి సాంబశివరావు, ఎగుమతి సంఘం అధ్యక్షుడు జుగిరాజు, కోల్డ్ స్టోరేజీల అసోసియేషన్ కార్యదర్శి సురేంద్రబాబు, చిల్లీ పౌడర్ మిల్స్ అసోసియేషన్ కార్యదర్శి వై.అనిల్, కార్మిక సంఘం అధ్యక్షుడు ఎం.శ్రీనివాసరెడ్డి, దిగుమతి సంఘం మాజీ అధ్యక్షుడు కొత్తూరి సుధాకర్, వేమెన్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

గ్రానైట్ ట్రేడర్‌కు టోకరా

- తక్కువ ధరకు ఇప్పిస్తానంటూ రూ. 4.5 లక్షల ఆన్‌లైన్ ట్రాన్స్‌ఫర్
- అనంతరం స్విచ్‌ఆఫ్ చేసిన మధ్యవర్తి

మార్టూరు: మధ్యవర్తి ద్వారా గ్రానైట్ స్లాబులు కొనుగోలు చేసేందుకు ప్రయత్నించిన ట్రేడర్ రూ. 4.5 లక్షలు పోగొట్టుకున్న వైనం గురువారం మార్టూరులో వెలుగు చూసింది.. హైదరాబాద్‌లో గ్రానైట్ ట్రేడింగ్ చేసే ఓ వ్యాపారికి గ్రానైట్ స్లాబులు అడుగు రూ. 50కు ఇప్పిస్తానంటూ మధ్యవర్తి మూడు లారీల లోడుకు ఒప్పందం చేసుకున్నాడు. తక్కువ ధరకు దొరుకుతాయని ట్రేడర్ ముందు వెనుక ఆలోచించక ఆన్‌లైన్ పేమెంట్‌కు ఒప్పుకున్నాడు. ఈ క్రమంలో మధ్యవర్తి స్థానిక జొన్నతాళి గ్రామ సమీపంలోని ఓ గ్రానైట్ ఫ్యాక్టరీలో అడుగు రూ. 80 చొప్పున కొనుగోలు చేసేందుకు బేరం మాట్లాడుకొని రెండు లారీలకు స్లాబుల లోడు ఎక్కించాడు. ధర విషయం ట్రేడర్‌కు తెలియకుండా జాగ్రత్త పడుతూ మధ్యవర్తి.. గ్రానైట్ ఫ్యాక్టరీ యజమాని ద్వారా స్లాబు లోడు పూర్తవుతుందని ట్రేడర్‌తో ఫోన్‌లో చెప్పించాడు. అనంతరం మధ్యవర్తి ఇచ్చిన బ్యాంకు ఖాతాకు హైదరాబాద్ నుంచి ట్రేడర్ రూ. 4.5 లక్షలకు ట్రాన్స్‌ఫర్ చేశాడు. తనకు ఎంత ధరకు గ్రానైట్ స్లాబులు బయలు దేరిన సమాచారం తెలియక పోవటంతో అనుమానం వచ్చిన ట్రేడర్ ఫ్యాక్టరీ యజమానికి ఫోన్ చేయగా తనకు నగదు అందకుండా స్లాబులు ఎలా పంపిస్తాను, నగదు అందలేదని చెప్పాడు. దీంతో గ్రానైట్ ట్రేడర్ తాను మోసపోయినట్లు తెలుసుకొని మధ్యవర్తికి ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. తమకు ఈ విషయమై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు. కాగా ఈ తరహా మోసాలు మార్టూరులో తరచూ జరుగుతున్నాయి.

దివ్యాంగురాలికి ఇంటి స్థలం

- జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ చొరవ
- ఆనందం వ్యక్తం చేసిన లబ్ధిదారు



స్థలాన్ని చూపుతున్న అధికారులు

బాపట్ల: తల్లిదండ్రులను కోల్పోయి నిరాదరణకు గురైన దివ్యాంగురాలికి జిల్లా కలెక్టర్ కె.విజయకృష్ణన్ అండగా నిలిచారు. యుద్ధ ప్రాతిపదికన నివాస స్థలాన్ని గురువారం మంజూరు చేశారు. చీరాల మండలం బుర్లవారిపాలేనికి చెందిన పిట్టు మల్లేశ్వరి పుట్టుకతోనే రెండు కాళ్లు లేని దివ్యాంగురాలు. ఆమె సంరక్షణ మొత్తం తల్లిదండ్రులు చూసుకునేవారు. తల్లిదండ్రులు ఇరువురూ ఏడాదిన్నర క్రితం మృతి చెందడంతో నిరాదరణకు గురైన ఆమె తీవ్ర ఇబ్బందులతో బతుకు వెళ్లదీస్తోంది. ప్రభుత్వం నుంచి పంపిణీ చేసే సామాజిక భద్రత పెన్షన్ మాత్రమే ఆమెకు ఆధారం. అలాంటి పరిస్థితుల్లో ప్రస్తుతం ఆమె సోదరుడి ఇంటి పంచలోనే మనుగడ సాగిస్తోంది. ఈనెల 8వ తేదీన చీరాల మండలం బుర్లవారిపాలెంలో జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ పర్యటించారు. ఆ సమయంలో రెండు కాళ్లు లేక నిరాధారణకు గురైన దివ్యాంగురాలిని గమనించి ఆరా తీశారు. చిన్న బంకులో తినుబండారాలు స్వీకరిస్తూ బతుకుతున్నానని కలెక్టర్ కు దివ్యాంగురాలు మల్లేశ్వరి వివరించారు. కనీసం తల దాచుకోవడానికి సొంత ఇల్లు కూడా లేదని ఆమె కలెక్టర్ వద్ద వాపోయింది. తక్షణమే స్పందించిన చర్యలు చేపట్టారు. ఇంటి స్థలాన్ని యుద్ధప్రాతిపదికన కేటాయించాలని స్థానిక చీరాల తహసీల్దార్ ప్రభాకర్ రావును జిల్లా కలెక్టర్ ఆదేశించారు. కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకోవడంతో తహసీల్దార్ పరిశీలించి ఈపురుపాలెంలో 519 సర్వే నెంబర్‌లోని 48 ప్లాట్‌ను మల్లేశ్వరికి మంజూరుచేశారు. తక్షణమే దివ్యాంగురాలైన మల్లేశ్వరిని ఆ ప్రాంతానికి తీసుకువెళ్లి పొజిషన్ చూపారు. పక్కా గృహాన్ని మంజూరు చేయాలని కలెక్టర్ ఆదేశించడంతో ఆ మేరకు ప్రతిపాదనలు తయారుచేసి తహసీల్దార్ గురువారం కలెక్టరేట్‌కు పంపారు. దీంతో జిల్లా కలెక్టర్ తల్లిలా తనను ఆదరించారని దివ్యాంగురాలు మల్లేశ్వరి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రభాకర్‌రావు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ విజేత కర్నూలు



రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ విజేతగా నిలిచిన కర్నూలు జట్టు

కర్లపాలెం: రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ విజేతగా కర్నూలు జిల్లా టీమ్ నిలిచింది. రాష్ట్ర ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నల్లూరి రాజ గోపాలరావు మెమోరియల్ రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ శాప్‌లీగ్ పోటీలు చింతాయపాలెంలో జరిగాయి. పోటీలలో కర్నూలు జిల్లా జట్టు విజేతగా నిలిచి ప్రథమ స్థానం కైవసం చేసుకోగా ద్వితీయస్థానంలో ఏలూరు జిల్లా జట్టు నిలిచింది. తృతీయ స్థానంలో బాపట్ల, చిత్తూరు జిల్లా జట్లు సంయుక్తంగా నిలిచాయని రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ కార్యదర్శి బి.నాగరాజు తెలిపారు. కర్లపాలెం మండలంలోని చింతాయపాలెం జెడ్పీ పాఠశాలలో రాష్ట్ర స్థాయిలో జరిగిన హ్యాండ్‌బాల్ శాప్‌లీగ్ పోటీలకు రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాల నుంచి వచ్చిన జట్లలో 150 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. గురువారం హ్యాండ్‌బాల్ పోటీలు ముగిశాయి. కార్యక్రమంలో సర్పంచి కె.శ్రీనివాసరావు, ఎంపీటీసీ ఆర్.లక్ష్మణరావు, రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ అసోసియేషన్ కార్యదర్శి పాల్‌కుమార్, అసోసియేషన్ కార్యదర్శి వెంకటేశ్వరరావు, పీఈటీ గోపి పాల్గొన్నారు.

నేటి నుంచి రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు

జె.పంగులూరు: స్థానిక పంగులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో సంక్రాంతి సందర్భంగా రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు శుక్రవారం నుంచి నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మొదటి బహుమతిగా రూ. 30,116ను ఏపీ శాప్ నెట్ చైర్మన్ బాచిన కృష్ణ చైతన్య, రెండో బహుమతి రూ. 20,116ను మువ్వా నరేంద్రబాబు (అపర్ణ పౌల్ట్రీ ఫాం), మూడో బహుమతి రూ. 15,116ను పంగులూరు గ్రామ సర్పంచ్ గుడిపూడి నాగేంద్రం రామారావు, నాలుగో బహుమతి రూ. 10,116ను సొసైటీ అధ్యక్షుడు రావూరి రంగారావు అందిస్తారని చెప్పారు.

మానసిక దివ్యాంగురాలిపై లైంగికదాడి

పర్చూరు: మానసిక దివ్యాంగురాలైన యువతిపై లైంగికదాడి జరిగిన ఘటన పర్చూరులోని ఇందిరాకాలనీలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. 19 ఏళ్ల వయసున్న యువతిపై అదే కాలనీకి చెందిన సుబ్రహ్మణ్యం అనే వ్యక్తి బలవంతంగా లైంగికదాడి చేసినట్లు బాపట్ల డీఎస్పీ ఎ.శ్రీనివాసరావు తెలిపారు. బాధితురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు చెప్పారు. మార్టూరు సీఐ ఫిరోజ్ దర్యాప్తు ప్రారంభించారని తెలిపారు. యువతిని వైద్య పరీక్షల నిమిత్తం చీరాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. పరారీలో ఉన్న నిందితుడు సుబ్రహ్మణ్యం కోసం గాలిస్తున్నామన్నారు.

ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా


– ఎంపీ నందిగం సురేష్



ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సర్వీసెస్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న బాపట్ల ఎంపీ నందిగం సురేష్, ఉద్యోగులు

ఉద్దండరాయునిపాలెం(తాడికొండ): ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని బాపట్ల ఎంపీ నందిగం సురేష్ పేర్కొన్నారు. ఉద్దండరాయునిపాలెంలోని తన నివాసంలో గురువారం ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సర్వీసెస్ అసోసియేషన్ బాపట్ల జిల్లా 2023 క్యాలెండర్‌ను ఆవిష్కరించి ఉద్యోగుల సమస్యలను సానుకూలంగా విన్నారు. స్పందించిన ఆయన ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళిఅన్ని సమస్యలు పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు వినుకొండ రాజారావు, జిల్లా అధ్యక్షుడు కూరపాటి సత్యం రాజు, కార్యదర్శి బడుగు శివాజీ, కోశాధికారి ఎస్.పుల్లారావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ పి.సిద్ధార్థ, సలహాదారుడు ఎన్‌కేవీ ప్రసాద్, ప్రకాష్, లక్షణ్ పాల్గొన్నారు.

పోలురాధ జూనియర్స్ విజేత కృష్ణా జిల్లా



సీనియర్స్ పోలురాధ పోటీల్లో పాల్గొన్న ఎడ్ల జత

పర్చూరు: అన్నంభొట్లవారిపాలెంలో నిర్వహిస్తున్న 35వ జాతీయ స్థాయి పోలురాధ జూనియర్స్ విభాగంలో కృష్ణాజిల్లా ఎడ్ల జత ప్రథమ బహుమతిని గెల్చుకుంది. చల్లపల్లి మండలం, కొత్తమాజేరు గ్రామానికి చెందిన తుమ్మల వెంకటరావు కోడెల జత 2,466.7 అడుగుల దూరం లాగి మొదటి బహుమతి గెల్చుకుంది. బాపట్ల జిల్లా, సుబ్బారెడ్డిపాలేనికి చెందిన సుబ్బారెడ్డి ఎడ్ల జత నిర్ణీత సమయంలో 2,326.10 అడుగుల దూరం లాగి ద్వితీయ బహుమతి, ఇదే జిల్లా, పోతురాజు కొత్తపాలేనికి చెందిన చిట్టిమాల చిన్న ఎడ్ల జత 2,174.11 అడుగుల దూరం లాగి తృతీయ బహుమతి గెలుపొందాయి. ఇదే జిల్లా, పాతచీరాలకు చెందిన ఎస్.ఎస్.వి.రెడ్డి బుల్స్ వారి ఎడ్ల జత 2,126.4 అడుగుల దూరం లాగి నాలుగో బహుమతిని గెల్చుకోగా, బాపట్ల జిల్లా, పోతురాజు కొత్తపాలెంకు చెందిన కావూరి చిన అంకిరెడ్డి ఎడ్ల జత 2,119.5 అడుగుల దూరం లాగి ఐదో బహుమతిని గెల్చుకుంది. చీరాల మండలం, బోయినవారిపాలెంకు చెందిన కృష్ణాయాదవ్ ఎడ్ల జత 2,107 అడుగుల దూరం లాగి ఆరో బహుమతిని, చీరాల మండలం, ఈపూరుపాలెంకు చెందిన కరణం నరసింహారావు ఎడ్ల జత 2,100 అడుగుల దూరం లాగి ఏడో బహుమతిని గెల్చుకున్నాయి. విజేతలైన ఎడ్ల యాజమానులకు నగదు బహుమతితో పాటు జ్ఞాపికలు అందజేశారు. కాగా గురువారం రాత్రి పోలురాధ సీనియర్స్ విభాగంలో ఎడ్ల జతలకు పోటీలు జరుగుతున్నాయి. మొత్తం ఈ విభాగంలో 22 జతలు పాల్గొంటున్నట్లు నిర్వాహకులు గోరంట్ల భాస్కరరావు తెలిపారు. శుక్రవారం సాయంత్రం నుంచి పాలపళ్ళ విభాగంలో బండలాగు బల ప్రదర్శన పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.